సాక్షి
వనపర్తి
గురువారం । 17 । జూలై । 2025



సీడ్ పత్తి రైతుల ఆగ్రహం

సమస్యలు పరిష్కరించాలంటూ సీడ్ పత్తి రైతులు గద్వాల రోడ్డుపై బైఠాయించారు.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప వరద

జూరాల ప్రాజెక్టుకు బుధవారం ఎగువ నుంచి 20 క్యూసెక్కుల వరద చేరింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /22.5

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులతో పని చేయించే బాధ్యత హెచ్‌ఎంలదే..



సాక్షి ఎఫెక్ట్..

వనపర్తిటౌన్: ఉపాధ్యాయుల్లో కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించామని.. అవసరమైనప్పుడు మాత్రమే డీఈఓ కార్యాలయానికి రావాలని డీఈఓ అబ్దుల్ ఘనీ స్పష్టం చేశారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'బడి.. మరిచారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి బుధవారం కార్యాలయంలో ఏయే విభాగాల్లో ఎవరెవరు ఉన్నారు.. ఎవరు ఏం పని చేస్తున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కార్యాలయంలో అదనపు బాధ్యతల ఉపాధ్యాయులు లేరని, పాఠశాలలకు అప్పగించామని చెప్పారు. వేతనాలు ఆయా పాఠశాలల నుంచే పొందుతారు కాబట్టి వారితో పని చేయించుకునే బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే అని తేల్చి చెప్పారు. వారు చెప్పినా విధులు నిర్వర్తించకుంటే అసమర్థతే అన్నారు. సీఎం ఓగా యుగంధర్‌ను రిలీవ్ చేస్తున్నామని.. కొత్తగా నియమించిన ప్రతాప్‌రెడ్డి గురువారం విధుల్లో చేరుతారని చెప్పారు. బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నందున విధుల్లోకి తీసుకోలేదన్నారు. పని లేకుండా కార్యాలయంలో అదనపు బాధ్యతలతో ఎవరు కనిపించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రత్యేక అధికారి తనిఖీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్‌బోర్డ్ ప్రత్యేక అధికారి విశ్వేశ్వర్ తనిఖీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందంతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పెంచేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం ఆయనను శాలువాతో సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సమస్యల.. జూరాల

వరదల సమయంలో ప్రాజెక్టు రహదారిపై వాహనాల బారులు



జూరాల ప్రాజెక్టు రహదారిపై వాహనాల రద్దీ (ఫైల్)

- గంటల తరబడి ట్రాఫిక్ జాం
- రాకపోకలకు తప్పని అవస్థలు
- పార్కింగ్ స్థలాల ఏర్పాటులో అధికారులు విఫలం

అమరచింత: ఉమ్మడి జిల్లాకే తలమానికంగా ఉన్న జూరాల ప్రాజెక్టు వద్ద వసతుల కల్పనలో అటు అధికారులు, ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరదొస్తే చాలు.. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకుల వాహనాలతో జలాశయం రహదారి నిండి గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదివారంతో పాటు ఇతర సెలవు దినాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. సంబంధిత అధికారులు ఎడమ కాల్వ వద్ద శాశ్వత పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయకపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది. వనపర్తి, నారాయణపేట జిల్లాల ప్రజలు జూరాల ప్రాజెక్టుపై నుంచి గద్వాల, రాయచూర్ తదితర ప్రాంతాలకు నిత్యం వ్యాపార పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. వరదల సమయంలో ఇలాంటి సమస్య నిత్యం ఎదురవుతుండటంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి దాపురిస్తోందని.. సంబంధిత అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వెంటనే వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించి రాకపోకల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

పార్కింగ్‌కు స్థలం ఉన్నా..

దిగువ పుష్కరఘాట్‌కు వెళ్లే ప్రదేశంలో విశాలమైన ఖాళీ స్థలం ఉన్నా అక్కడ వాహనాలు నిలిపేందుకు వినియోగించడం లేదు. గతేడాది ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు తాత్కాలికంగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. తర్వాత పట్టించుకోకపోవడంతో సమస్య తలెత్తుతోంది.

పోలీసుల చర్యలు అంతంత మాత్రమే..

ప్రాజెక్టు ఆనకట్ట వద్ద రద్దీ నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఇలాంటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగం అమరచింత పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో వరదల సమయంలో డ్యాం బీట్‌కు రోజు ముగ్గురు జవాన్లు.. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణకు హెడ్ కానిస్టేబుల్, ఐదుగురు జవాన్లను కేటాయిస్తున్నామని ఆత్మకూర్ సీఐ వెల్లడిస్తున్నా, ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి.

సమస్య పరిష్కరించాలి..



జూరాల ప్రాజెక్టుపై ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. డ్యాం పైనుంచి గద్వాల, రాయచూర్‌కు అక్కడి వారు వనపర్తి, నారాయణపేటకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎడమ కాల్వ వద్ద వాహనాలు నిలపడంతో గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారు.

– కుర్మారెడ్డి, కిష్టంపల్లి

పార్కింగ్ సౌకర్యం కల్పించాలి..



ఎడమ కాల్వ సమీపంలోని పుష్కరఘాట్ రహదారిలో ప్రాజెక్టుకు సంబంధించిన ఖాళీ స్థలం చాలా ఉంది. వాహనాలు నిలిపేందుకు తగిన వసతులు కల్పించాలి. ఈ విషయంపై పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలి.

– వెంకటేష్, నందిమళ్ల

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం



జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తిన సమయంలో చూసేందుకు పర్యాటకులు భారీగా వస్తున్నారు. అంతేగాకుండా చేప వంటకాలు తినేందుకు ఆసక్తి చూపుతూ వాహనాలను రహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని గుర్తించాం. పుష్కరఘాట్ వైపు వాహనాలు నిలిపి ఉంచేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. సెలవు రోజుల్లో సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండ తగిన చర్యలు తీసుకుంటాం.

– శివకుమార్, సీఐ, ఆత్మకూర్

ఎడమ కాల్వ వద్దే సమస్య..

ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులు తమ వాహనాలను నిలిపేందుకు పుష్కరఘాట్ రోడ్‌లో స్థలం ఉన్నా.. ఎడమ కాల్వ వద్ద చేపలను విక్రయిస్తుండటంతో వాటి కొనుగోలుకు రహదారికి ఇరువైపులా నిలిపివేస్తున్నారు. అంతేగాకుండా కొనుగోలు చేసిన చేపలను అక్కడే ఉన్న హోటళ్లలో వండటానికి ఇచ్చి భుజించేందుకు గంటల తరబడి వాహనాలను తీయకపోవడంతో డ్యాం రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.



ఎడమ కాల్వ సమీపంలో చేపల విక్రయాల వద్ద రద్దీ (ఫైల్)

ప్రాదేశిక స్థానాల లెక్క తేలింది

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ప్రకటించిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 780 ఎంపీటీసీ స్థానాలు
- పంచాయతీ కన్నా ముందే జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఊహాగానాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడవచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో పంచాయతీ ఎన్నికల కంటే ముందుగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ ఎన్నికలు ఉంటాయన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

రిజర్వేషన్లపై వీడని సందిగ్ధం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. రానున్న ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే పంచాయతీ సర్పంచుల పదవీకాలం పూర్తయ్యి ఏడాదిన్నర కాలం గడిచింది. సుదీర్ఘకాలంగా ప్రత్యేక పాలన కొనసాగుతుండటంతో తిరిగి ఎన్నికలు ఎప్పుడు చేపడుతారోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెబుతోంది. ఈ క్రమంలోనే ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు కల్పించేందుకు సన్నాహాలు చేపడుతోంది. ఈ ప్రక్రియ వేగవంతమైన ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగితేనే బీసీలకు రిజర్వేషన్ పెంపు అమలయ్యే అవకాశం ఉంది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాలన్న కోర్టు ఆదేశం నేపథ్యంలో రిజర్వేషన్ల అమలుపై సందిగ్ధం నెలకొంది. కొత్తగా బీసీలకు రిజర్వేషన్‌ను పెంచి ఎన్నికలు నిర్వహిస్తారా, లేక పాత రిజర్వేషన్లకే పరిమితమవుతారా? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

జిల్లాల వారీగా ఖరారైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు..

జిల్లా	జెడ్పీటీసీ	ఎంపీపీ	ఎంపీటీసీ
మహబూబ్‌నగర్	16	16	175
నాగర్‌కర్నూల్	20	20	214
వనపర్తి	15	15	113
జోగుళాంబ గద్వాల	13	13	142
నారాయణపేట	13	13	136

జోరుగా పైరవీలు..!

హైదరాబాద్‌కు చేరిన ధాన్యం లారీ పంచాయితీ



రూ.5 కోట్ల విలువ గల ధాన్యం బస్తాలు గుట్టుగా డంప్ చేసిన రాయచూరులోని రైస్‌మిల్లు ఇదే..

- ప్రభుత్వ పెద్దను ఆశ్రయించిన మిల్లు యజమాని
- తాజాగా రాయచూర్ సమీపంలోని మిల్లులో 50 వేల బస్తాల ధాన్యం డంప్
- ధాన్యం లారీ వ్యవహారంలో ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న అక్రమాలు
- సదరు రైస్ మిల్లుకు మూడు సీజన్లలో రూ.45 కోట్ల ధాన్యం కేటాయింపు
- మర ఆడించి అందించింది రూ.5 కోట్ల బియ్యమే..
- లెక్కలు తేల్చే పనిలో సివిల్‌సప్లయ్ శాఖ అధికారులు



పట్టుబడిన ధాన్యం లోడ్ లారీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్/గద్వాల: కేటీదొడ్డిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ధాన్యం లోడు లారీ పంచాయితీ హైదరాబాద్‌కు చేరింది. ప్రభుత్వంలోని కీలకంగా వ్యవహరించే పెద్దను ఆశ్రయించి అక్రమాల నుంచి బయటపడేందుకు రైస్‌మిల్లు యజమాని జోరుగా పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ అవినీతి బాగోతంలో తవ్వే కొద్ది అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వ సొమ్మును కాజేయడంలో కాకలుతీరిన సదరు రైస్ మిల్లు యజమాని తనకున్న పలుకుబడితో 2022 రబీ, 2024 ఖరీఫ్, 2024–25 రబీ సీజన్లలో సుమారు రూ.45 కోట్ల విలువ గల ధాన్యాన్ని తన మిల్లుకు కేటాయించేలా చేసినా.. ప్రభుత్వానికి తిరిగి 10 శాతం మాత్రమే సీఎమ్మార్ బియ్యం అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో సుమారు రూ.5 కోట్ల విలువ గల ధాన్యాన్ని కర్ణాటకలోని రాయచూరు సమీపంలో ఉన్న ఓ రైస్ మిల్లులో గుట్టుగా దాచిపెట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రభుత్వ పెద్ద వరకు పంచాయితీ

నందిన్నెలోని ఓ రైస్‌మిల్లు యజమాని ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో 400 క్వింటాళ్ల వడ్ల ధాన్యం లారీ అక్రమంగా కర్ణాటకలోని రాయచూరుకు తరలిస్తుండగా.. విషయం తెలుసుకొని గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. సదరు రైస్ మిల్లు యజమాని ఈ కేసు నుంచి బయటపడేందుకు గద్వాల సివిల్‌సప్లై శాఖలోని ఓ అధికారిని మొదట ఆశ్రయం పొందాడు. అయితే, పరిస్థితి సీరియస్ కావడంతో అధికార పార్టీకి చెందిన ఓ నేత ద్వారా ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే ఓ పెద్దను ఆశ్రయించినట్లు తెలిసింది. తనపై ఎలాంటి కేసులు నమోదు కాకుండా హైదరాబాద్‌లో తిష్టవేసి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

❐ 2022 రబీలో 1,425.520 మెట్రిక్ టన్నుల ధాన్యం, 2024 ఖరీఫ్‌లో 5,948.560 మెట్రిక్ టన్నులు, 2024–25రబీలో 10,294.680 మెట్రిక్ టన్నులు మొత్తంగా మూడు సీజన్లలో సుమారు రూ.45 కోట్ల విలువ గల (40కేజీల సామర్థ్యం ఉన్న 4 లక్షల ధాన్యం బస్తాలు) ధాన్యం సివిల్ సప్లయ్ శాఖ అధికారులు సదరు మిల్లుకు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు 2024 ఖరీఫ్‌కు సంబంధించి 17 ఏసీకేల వరకు, మార్చి 2024–25 రబీకి సంబంధించి 13 ఏసీకేల వరకు బియ్యంగా మార్చి అందించారు. 2022 రబీకి సంబంధించి బియ్యం నేటికీ అందించలేదు. ఇలా మొత్తంగా ప్రభుత్వానికి ఇప్పటి వరకు కేవలం రూ.5 కోట్ల విలువ గల బియ్యం మాత్రమే అందించాడు. ఇంకా రూ.40 కోట్ల విలువ గల బియ్యం అందించాల్సి ఉందని అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది.

ముడుపులతో కెపాసిటీ పెంపు

నందిన్నెకు చెందిన సదరు రైస్‌మిల్లు యజమాని అధికారంలో ఏ పార్టీ ఉంటే వారికి జైకొట్టి తన అక్రమ దందా కొనసాగిస్తుంటాడనే ఆరోపణలు వినవస్తున్నాయి. సాధారణంగా రైస్‌మిల్లుకు ధాన్యం కేటాయించే క్రమంలో అధికారులు మిల్లు కెపాసిటీని పరిగణలోకి తీసుకుంటారు. అయితే, ఈ మిల్లు సామర్థ్యం 6 టన్నులు ఉంటే దానిని 10 టన్నులకి పెంచుకుని పెద్దమొత్తంలో ధాన్యం కేటాయించుకున్నాడు. ఇందులో తనకు సహకరించిన సివిల్ సప్లయ్ శాఖలోని ఓ కీలక అధికారికి దాదాపు రూ.6 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

లెక్కలు తేల్చడంలో అధికారుల మీనమేషాలు

అక్రమంగా ధాన్యం తరలిస్తూ పట్టుబడిన క్రమంలో ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు బయటికి తీయడంలో సివిల్‌సప్లై శాఖ అధికారులు కుస్తీ పడుతున్నారు. వాస్తవానికి సీజన్ల వారీగా మిల్లులకు కేటాయించిన ధాన్యం, అందుకు సంబంధించి మిల్లులు తిరిగి ఇచ్చిన బియ్యం లెక్కలు ప్రతిరోజు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. అయితే అక్రమంగా దొరికిన ధాన్యం లోడులారీ లెక్కలు తీయడంలో మాత్రం అధికారుల మీనమేషాలు లెక్కిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆన్‌లైన్‌లో అన్ని లెక్కలు ఉన్నా.. విచారణ పేరిట కాలయాపన చేసి సదరు రైస్‌మిల్లు యజమానిని తప్పించే పనిలో సివిల్ సప్లయ్ శాఖ అధికారుల బిజీగా ఉన్నట్లు బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజా పైరవీల నేపథ్యంలో అవినీతి లెక్కలు బయటకు వస్తాయా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వాలని నందిన్నెలోని సదరు రైస్ మిల్లుకు కేటాయిస్తే.. మిల్లు యజమాని ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడంపై నందిన్నె గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రైస్ మిల్లు యజమానిపై చర్య తీసుకోవాలంటూ కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదిలాఉండగా, ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న సివిల్ సప్లయ్ డీఎస్‌ఓ స్వామిని వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్ ద్వారా ప్రయత్నించగా స్పందించలేదు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి.. చిత్రంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ యాదయ్య తదితరులు

- పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందిస్తాం
- ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని.. అందుకు అనుగుణంగా మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు వడ్డీ లేని రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని మదనాపురం, కొత్తకోటకు సంబంధించిన ఇందిరా మహిళాశక్తి సంబరాలు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తే కుటుంబాలు బాగుపడతాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్ మహిళా సంఘాల ద్వారానే కుట్టిస్తున్నామని, కొత్తకోట మిరాసిపల్లి వద్ద మహిళలతో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆర్టీసీ అద్దె బస్సులకు యజమానులను చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులు హైదరాబాద్‌లో విక్రయించేందుకు శిల్పారామంలో అవకాశం కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 43 వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. ఇందుకుగాను విద్యుత్‌శాఖకు ప్రభుత్వం రూ.1.26 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్యం బలోపేతానికి ప్రభుత్వ ఆసుపత్రులు, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దేవరకద్రలో రూ.రెండు వేల కోట్లతో బ్రహ్మోస్ క్షిపణి కర్మాగారం, అడ్డాకుల వద్ద డ్రైపోర్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం..

కుటుంబంలో మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులుగా ఉంటారని.. అందుకే ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తోందని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాల ఖాతాల్లో రూ.15.5 కోట్ల వడ్డీని జమ చేసినట్లు చెప్పారు. మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకొస్తే రుణాలిచ్చి ప్రోత్సహించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. త్వరలోనే జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 50 వేల యూనిఫామ్‌లను మహిళా సంఘ సభ్యులతో కుట్టించినట్లు వివరించారు. వరి కొనుగోలు కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డీఆర్డీఓ ఉమాదేవి జిల్లాలో మహిళా సాధికారితకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఐదుగురు ఉత్తమ మహిళా సంఘాల సభ్యులను సన్మానించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వడ్డీ లేని బ్యాంకు రుణాలు రూ.8.30 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. మండల మహిళా సంఘాలకు ప్రమాద, రుణ చెక్కు రూ.2.38 లక్షలు, కొత్తకోట పురపాలికకు సంబంధించి రూ.65,29,903 చెక్కును అందజేశారు. ఆర్టీసీ బస్సు నుంచి వచ్చిన అద్దె రూ.1,38,936 చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యాదయ్య, మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పావని, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మండల సమాఖ్య అధ్యక్షులు చెన్నమ్మ, జయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- రాష్ట్ర సంక్షేమ పథకాల్లో 60 శాతం నిధులు కేంద్రానివే..
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



అజ్జకొల్లు గాంధీనగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మదనపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు వివరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లులో రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు 60 శాతం నిధులు కేంద్రానివేనని తెలిపారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారతదేశం శక్తివంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నర్సింగాపురం గ్రామానికి చెందిన కావలి శివకుమార్ ఆధ్వర్యంలో 50 మంది గ్రామస్తులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి, పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర బీజేపీ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, పాలమూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర కన్వీనర్ కురువ రమేష్, భరత్‌భూషణ్, మాధవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కృష్ణయాదవ్, దుప్పల్లి అంజనేయులు, బాబుగౌడ్, అమర్‌నాథ్, కురుమన్న పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను కాపాడాలి

ఖిల్లాఘనపురం: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసిన వెంటనే నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు నాటాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని పరిశీలించి నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



మహిళా రైతుకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఆర్థికాభివృద్ధి సాధించేందుకే రుణాలు..

రైతులు వ్యవసాయంతో పాటు పశువులు, కోళ్లు, గొర్రెల పెంపకం చేపట్టినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సింగిల్‌విండో ద్వారా రైతులకు కర్షకమిత్ర పథకం కింద మంజూరైన రుణాల ప్రొసీడింగ్‌లు అందించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా సింగిల్‌విండో ద్వారా సుమారు రూ.5 కోట్ల కర్షకమిత్ర రుణాలు ఇస్తున్నామని.. రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. త్వరలోనే సింగిల్‌విండో బ్యాంకు ఏర్పాటు చేస్తామని.. అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, డైరెక్టర్లు సాయిచరణ్‌రెడ్డి, రాము, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, క్యామ వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగిఉన్న లారీని ఢీకొన్న కంటైనర్

● లారీ డ్రైవర్ దుర్మరణం



బోయ బాలకృష్ణ (ఫైల్)

మరికల్: ఆగిన ఉన్న లారీని కంటైనర్ ఢీకొనడంతో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందిన ఘటన అర్ధరాత్రి 2గంటలకు పెద్దచింతకుంట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూత్పూర్ మండలం కర్వేనకు చెందిన బోయ బాలకృష్ణ(34)మంగళవారం రాత్రి మహబూబ్‌నగర్ నుంచి రాయిచూర్‌కు లారీని తీసుకెళ్తుండగా మరికల్ మండలం పెద్దచింతకుంట స్టేజీ వద్దకు రాగానే టైర్ పంక్చర్ అయింది. రోడ్డు పక్కన నిలిపి లారీ కిందికి వెళ్లి టైర్ మారుస్తుండగా.. వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీని ఢీకొట్టడంతో లారీ కింద ఉన్న డ్రైవర్ తలకు తీవ్రగాయలై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

పురుగుమందు తాగి యువకుడి బలవన్మరణం

వనపర్తి రూరల్: పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుందని ఎస్ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా గుత్తి మండలానికి చెందిన రేవంత్‌కుమార్(27) డ్రైవర్. ఐదేళ్ల కిందట తండ్రి మృతిచెందగా.. అప్పటి నుంచి ఇంటి బాధ్యత తీసుకున్నాడు. మృతుడు ఈనెల 14న బొలేరోలో గుత్తి మార్కెట్ నుంచి పచ్చిమిర్చి లోడ్ వేసుకొని నిజామాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో 15న సాయంత్రం 7:20 గంటల సమయంలో మృతుడి తమ్ముడు కిరణ్‌కుమార్‌కు వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నాని.. చేసిన అప్పుల వివరాలు ఇంట్లో ఉంచిన ఒక నోట్‌బుక్‌లో రాసిపెట్టాను.. పొలం అమ్మి అప్పులు కట్టమని.. అమ్మ జాగ్రత్త అని చెబుతూ వీడియోకాల్‌లో తమ్ముడు చూస్తుండగానే పురుగుల మందు తాగాడు. మృతుడి ఫోన్ లోకేషన్ ఆధారంగా పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తకోట బైపాస్ వద్ద బొలేరోను గుర్తించి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కిరణ్‌కుమార్ బుధవారం పెబ్బేరు పోలీస్‌స్టేషలో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెపిల్లలు మృతి



గట్టు: కుక్కల దాడిలో 20 గొర్రెల పిల్లలు మృతిచెందినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. మాచర్లకు చెందిన గొర్రెల కాపరులు రాయచూర్ రామన్న, హనుమంతు, ఉరుకుందు, వీరేశ్‌కు చెందిన గొర్రెలను గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పొలంలో నిలిపారు. పగటిపూట గొర్రెలను మేపడానికి మరో పొలానికి వెళ్లగా..., గొర్రె పిల్లలను వలలో వేసి వెళ్లారు. గొర్రెపిల్లలున్న చోట ఎవరు లేకపోవడతో కుక్కలమంద వలలోకి చొరపడి గొర్రెపిల్లలపై దాడి చేశాయి. కుక్కల దాడిలో 20 గొర్రెపిల్లలు మృతిచెందినట్లు కుర్వ వీరేశ్ తెలిపారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు.

సీడ్ పత్తి రైతుల ఆగ్రహం



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సీడ్ పత్తి రైతులు

● రహదారిపై బైఠాయించి రాస్తారోకో
● ఆర్గనైజర్లు, సీడ్ కంపెనీల ప్రకటనకు నిరసన
● వివిధ పార్టీలు, సంఘాల నాయకుల మద్దతు
● స్తంభించిన ట్రాఫిక్, కదిలివచ్చిన అధికారులు, పోలీసులు



రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

అయిజ: విత్తన పత్తి రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులు బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం శివారులో బింగుదొడ్డి సమీపంలో రోడ్డెక్కారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు సంబంధించిన సీడు పత్తిని సాగుచేసే రైతులు గద్వాల రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపడంతో 5గంటల సేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. విత్తన పత్తి విత్తనాలను రైతులకు అందజేసే ఆర్గనైజర్లు, వివిధ కంపెనీల యజమానులు రైతులకు నష్టం చేకేర్చేవిధానాన్ని అమలు చేస్తున్నారని సీడు పత్తి రైతులు వాపోయారు. ఆర్గనైజర్లు అందజేసిన విత్తన పత్తిని సాగుచేశామని, పూత దశకు వచ్చిన అనంతరం ఎకరానికి కేవలం 2క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ఆర్గనైజర్లు, సీడ్ కంపెనీలు ప్రకటించారని మండిపడ్డారు. విత్తనాల కొనుగోలు విషయంలో సీలింగ్ విధానం చేపట్టడమంటే రైతుల గొంతులు నిలువునా కోయడమేనన్నారు. రైతు పండించిన విత్తనాలన్నింటిని ఎలాంటి షరుతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తరలివచ్చిన అధికారులు

ఘటనా స్థలానికి తహసీల్దార్ జ్యోతి రెవెన్యూ బృందంతో కలిసి చేరుకున్నారు. అదేవిధంగా ఎస్సై శ్రీనివాసరావు పోలీస్ బృందంతో వెళ్లారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, గురువారం కలెక్టరేట్‌లో ఆర్గనైజర్లు, కంపెనీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తామని రైతులు వచ్చి వారి సమస్యను తెలియజేయాలని తహసీల్దార్ రైతులకు చెప్పారు. ఎంతగా నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు రోడ్డుపై నుంచి వెళ్లలేదు. రైతులను కంట్రోల్ చేయడానికి సీఐ టాటాబాబు, డీఎస్పీ మెగిలయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

"

ఆర్గనైజర్లు మోసం చేశారు



సీడు పత్తి విత్తనాలు ఇచ్చి ఆర్గనైజర్లు రైతులను మోసం చేశారు. నేను 2ఎకాలు సీడుపత్తిని సాగు చేశా. ఇప్పుడు పూత దశకు చేరుకుంది. ఎకరాకు కేవలం రెండు క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేస్తామని అంటున్నారు. ఆర్గనైజర్లు రైతులను నిలువనా మోసం చేశారు.

– నాగరాజు, సీడుపత్తి రైతు

ముందే చెప్పాలి



విత్తనపత్తి సాగుకు అప్పు చేశాం. క్రాసింగ్ చేయించేందుకు కూలీలకు డబ్బు చెల్లించాం. పెట్టుబడులు పెట్టాం. తీరా పూతకొచ్చే సమయానికి ఎకరానికి రెండు క్వింటాళ్లు మాత్రమే కొంటామంటున్నారు. ఆ విషయం సాగుకు ముందే చెప్పాలి.

– దొడ్డెన్న, సీడుపత్తి రైతు

మొత్తం విత్తనాలు కొనాలి



రైతు పండించిన సీడు పత్తి విత్తనాలను ప్రతి సంవత్సరం మొత్తం కొనే వారు. ఈ ఏడాది కేవలం ఎకరానికి రెండు క్వింటాళ్లు కొంటామంటున్నారు. ఆ విధంగా చేస్తే రైతులు పూర్తిగా నష్టపోతారు. రైతులు ఎన్ని క్వింటాళ్లు పండిస్తే అన్ని క్వింటాళ్లను కొనుగోలు చేయాలి.

– ఉలిగన్న, సీడుపత్తి రైతు

మద్దతు తెలిపిన నాయకులు

రైతులు చేపట్టిన ధర్నాకు వివిధ పార్టీల, సంఘాల నాయకులు మద్దతిచ్చారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్‌కుమార్ డీఏవో సక్రియానాయక్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సీడ్ ఆర్గనైజర్‌లతో మాట్లాడి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు శక్తిమేరా కృషిచేస్తామని ఆర్గనైజర్లు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

జూరాలకు స్వల్ప వరద

● 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
● ప్రాజెక్టు నుంచి దిగువకు 41,077 క్యూసెక్కులు
● ఐదు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గినట్లు ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 8.30గంటల వరకు ప్రాజెక్టుకు 31,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రానికి 20వేల క్యూసెక్కులకు చేరినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36, 613 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్టు–1కు 1,300, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 69, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 500, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150, భీమా లిఫ్టు–2కు 750, సమాంతర కాల్వవకు 500 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 41,077 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 98.583 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 58, 833 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి దిగువనున్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 42, 500 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 30.435 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 45వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 21గేట్లను ఎత్తి దిగువనున్న జూరాలకు ప్రాజెక్టుకు 65, 995 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పది యూనిట్లలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక నుంచి వరద నీరు చేరుతుండడంతో దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. బుధవారం పది యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 125.132 ఎంయూ, దిగువలో 5 యూనిట్ల ద్వారా 200 మెగావాట్లు, 148.065 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 273.197 మెగా యూనిట్లు విజయవంతంగా చేపట్టామన్నారు. ప్రస్తుతం 36వేల క్యూసెక్కులను వినియోగించి విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని తెలిపారు.

శ్రీశైలంలో 881.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 881.7 అడుగుల నీటిమట్టం వద్ద 197.4616 టీఎంసీల నిల్వ ఉంది. ప్రస్తుతం జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ.. 36,613, సుంకేసుల నుంచి 16,688 కలిపి మొత్తం 53, 301 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతున్నాయి. భూగర్భకేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 33,023 మొత్తం 68, 338 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24గంటల్లో పోతిరెడ్డిపాడు ద్వారా 20వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కులను విడుదల చేశారు. భూగర్భకేంద్రంలో 17.634 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 17.907 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యనందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా

● విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా
● ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సర్కారు బడులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. కేంద్రం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్, పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండికేటర్స్ సర్వే ప్రకారం 2021లో మెరుగైన విద్యలో రాష్ట్రం 36వ స్థానం నుంచి 2024లో పదిస్థానాలు మెరుగుపడి 26వ స్థానానికి చేరుకుందన్నారు. రానున్న పదేళ్లలో వన్ ట్రిలిమ్ ఎకానమిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఉమ్మడి జిల్లాను రాష్ట్రం నుంచి ముందుకు తీసుకుపోవాలన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. పదో తరగతి ఫలితాలు చూడకుండా ప్రతి మండలం, పాఠశాలల టీచర్, విద్యార్థి వారీగా విశ్లేషించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అత్యుత్తమ ఎక్సలెన్సీ దిశగా పోవాలన్నారు. వంద శాతం ఫలితాలు రాని సబ్జెక్ట్ టీచర్లకు క్లస్టర్‌స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. మండల అధికారులు తనిఖీల్లో గుర్తించిన లోపాలను 10, 15రోజుల్లో సరి చేసుకోవాలన్నారు. విద్యార్థుల సంఖ్య ప్రకారం టీచర్ నిష్పత్తి ఉండాన్నారు. విద్యార్థులను ఎన్‌రోల్‌మెంట్ యూడైస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోలైన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా చూడాలన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో ఎన్‌రోల్‌మెంట్ పెరగడంపై అభినందిచారు. మూతపడి ఓపెన్ అయిన పాఠశాలలకు రూ.2లక్షల గ్రాంట్ అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల డిమాండ్ మేరకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశం పొందడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఫేసియల్ రికగ్నేషనల్ యాప్‌లో హాజరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 1.12లక్షల మంది ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్ అందించడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కేజీబీవీ విద్యార్థులు పదో తరగతిలో సాధించిన ఫలితాల కంటే మోడల్ స్కూల్‌లో చాలా తక్కువగా ఉందన్నారు. మోడల్ స్కూల్‌లో పాలమూరు జిల్లాలో 84శాతం ఉంటే నాగర్‌కర్నూల్‌లో 60శాతం ఉందన్నారు. మధ్యాహ్న భోజనం శాంపిల్స్ సేకరించి లాబ్‌కు పంపాలన్నారు. 250 పాఠశాలల్లో ఏఐ లాబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో టీచింగ్ ఖాళీలు ఉంటే వెయిటింగ్ లిస్టు నుంచి కలెక్టర్ ఆమోదంతో భర్తీ చేయాలన్నారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో పదో తరగతి ఫలితాలు గతేడాదికంటే పెరిగిందన్నారు. అనంతరం ఓపెన్‌స్కూల్ సొసైటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని ఎన్‌రోల్‌మెంట్‌లో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన ఎంఈఓలను సన్మానించారు.

ఇండోర్ స్టేడియానికి కొత్త హంగులు



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మైక్‌సిస్టమ్

● రూ.42లక్షలతో అధునాతనమైన మైక్‌సిస్టమ్ ఏర్పాటు
● సోలార్ విద్యుత్‌కు ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం మెయిన్ స్టేడియంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియానికి నూతన శోభ ఉట్టిపడుతుంది. ఇప్పటికే అనేక క్రీడా వసతులున్న ఇండోర్ స్టేడియంలో ఇప్పుడు అధునాతనమైన మైక్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ ఇండోర్ స్టేడియంలోని మైక్ సిస్టమ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రూ.42లక్షల నిధులతో ఇండోర్ స్టేడియంలో మైక్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధునాతనమైన జర్మన్ టెక్నాలజీతో కూడిన మైక్ సిస్టమ్ అమర్చినట్లు తెలిపారు. 16స్పీకర్‌లు, 8 యాంపిల్‌ఫైర్‌లు, 4 వూఫర్‌లు, 4 కార్డ్‌లెస్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలు జరిగే సమయంలో ఇలాంటి మైక్ సిస్టమ్‌తో ఎలాంటి రీసౌండ్ ఉండని, స్పష్టమైన సౌండ్ వస్తుందన్నారు. ఇండోర్ స్టేడియంలో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డిని కలిసి సోలార్ విద్యుత్ ఏర్పాటు గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో ఇండోర్ స్టేడియంలో సోలార్ విద్యుత్ ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో అధునాతనమైన సౌకర్యాలు కల్పిస్తుండడంపై జిల్లాలోని క్రీడాకారురులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల తరఫున పోరాడేది '1104' మాత్రమే

విద్యుత్ ఉద్యోగుల 1104 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబాను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ కార్మికుల తరఫున పోరాడేది కేవలం 1104 మాత్రమేనని విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ పరిస్థితి ఎవరికీ రాకూడదంటే కార్మికులు ఐకమత్యంతో ఉండాలని కోరారు. కులాల ప్రాతిపదికన విడిపోయినట్లైతే ముందు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటామన్నారు. ఎల్లవేళలా రాష్ట్రంలో కార్మికుల కోసం అహర్నశలు పరితపించే నాయకత్వం కేవలం మన 1104 యూనియన్ నాయకులకే సాధ్యమన్నారు. ఆర్జిన్ కార్మికులకు క్యాజువల్ లీవ్స్‌తోపాటు విద్యార్థులను బట్టి కన్వర్షన్ ఇవ్వాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో యాజమాన్యానికి యూనియన్ తరఫున లెటర్ ఇచ్చామన్నారు. ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ కోసం ప్రతి సందర్భంలో యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకుపోతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను గజమాలతో సన్మానించడంతోపాటు జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో 1104 యూనియన్ సర్కిల్ అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి పాండునాయక్, విజయ్ ముదిరాజ్ సర్కిల్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఈఆర్‌ఓ, ఓఅండ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ: వ్యక్తి మృతి

బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన వెంకటయ్యగౌడ్(45) బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటయ్యగౌడ్ ద్విచక్రవాహనంపై వెంకటాపూర్‌లో ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ప్రమాదశావత్తు ఢీ కొన్నాయి. వెంకటయ్యగౌడ్ మృతిచెందాడు.

మద్యం మత్తులో బస్సు డ్రైవర్‌పై యువకుల దాడి

● కారుకు సైడ్ ఇవ్వలేదని ఆగ్రహంతో బస్సులోంచి లాగి పిడిగుద్దులు
● బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు



ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేస్తున్న యువకులు

దోమలపెంట: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కారు సరిగ్గా సైడ్ ఇవ్వలేదని హైదరాబాద్ నుంచి శ్రీశైలం వస్తున్న పికెట్ డిపోకు చెందిన సూపర్ లగ్జరి డ్రైవర్‌పై మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు దాడి చేసిన ఘటన సోమవారం మధ్యాహ్నం శ్రీశైలం ఆనకట్ట వద్ద చోటుచేసుకున్నట్లు ఈగలపెంట ఎస్ఐ జయన్న తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. శ్రీశైలం నుంచి హైదరాబార్‌కు కారులో వెళ్తున్న యువకులు శ్రీశైలం ఆనకట్ట ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఎదరుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ సరిగ్గా దారి ఇవ్వలేదని బస్సును ఆపి డ్రైవర్ ప్రభాకర్‌ను బస్సులోంచి కిందకు లాగి పిడిగుద్దులతో దాడి చేశారు. ఘటనా స్థలంలో ఉన్న కొందరు డ్రైవర్‌ను యువకుల దాడి నుంచి కాపాడారు. దీంతో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. యువకులు హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తించామని, త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఆనకట్ట ఘాట్‌రోడ్డు మలుపు వద్ద సైడ్ ఇవ్వాలంటే రోడ్డు సరిపోదని.. డ్రైవర్ వీలైనంత వరకు సైడ్ ఇచ్చినట్లు చెప్పారు. యువకులు మద్యం మత్తులో ఉండడంతో ఆవేశంతో దాడి చేసినట్లు చెప్పారు.

బంగారం చోరీ కేసు ఛేదన

● నిందితుల గుర్తింపు.. ఒకరి అరెస్ట్
● మిగతావారి కోసం గాలింపు



పట్టుబడిన నగలతో వివరాలు వెల్లడిస్తున్న సీఐ టాటాబాబు

రాజోళి: శాంతిగనర్‌లోని బంగారు దుకాణంలో నగలను చోరీ చేసిన దుండగులను అరెస్ట్ చేసినట్లు సీఐ టాటాబాబు తెలిపారు. బుధవారం ఆయన శాంతిగనర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శాంతిగనర్‌లోని శ్రీనివాస జ్యూవెల్లర్స్‌లో ఈనెల 3వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు వేసుకుని, షాపులో ఉన్న బంగారు, నగదును తీసుకుని బైక్‌లపై పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు బోగరి రవిని పట్టుకుని ఆయన నుంచి రూ.1.5లక్షల నగదు, వెండి బార్లు, వెండి పాదపట్టీలు, మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అటెన్షన్ డైవర్షన్ పేరుతో జరిగిన ఈ చోరీలో బాధితుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని తెలిపారు. అందులో భాగంగా ఒరిస్సాకు చెందిన సోను, పాలపర్తి శివ, పాలపర్తి ప్రవీణ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టామని, వీలైనంత త్వరగా వారిని పట్టుకుంటామని పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా డి.ఫణీందర్

మెట్టుగడ్డ: స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా డి. ఫణీందర్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఫణీందర్ మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జ్ అధికారిగా కొనసాగనున్నారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించే డి.రవీందర్ గత నెలలో పదవీ విరమణ పొందడంతో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణ మొత్తం జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే కొనసాగుతాయి.

కళాశాల బాత్రూంలో పాము

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బుధవారం జ్యోతిరావు పూలే బాలుర జూనియర్ కళాశాల బాత్రూంలో విషసర్పం కనిపించడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. కళాశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించగా.. అతను చేరుకొని విషసర్పాన్ని పట్టుకొని జనసంచారం లేని ప్రదేశంలో వదిలివెళ్లాడు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధ్యాపకులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

శాంతియుతంగా పండగలు నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: శాంతియుతంగా పండగలు నిర్వహించుకోవాలని, డీజేలకు స్వస్తిపలకాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే యజమానులు, నిర్వాహకులు, జానపద కళాకారులు, చెక్కభజన మండలి, సాంస్కృతిక కళామండలి, భజన మండలి, కళాకారులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. గణేష్ ఉత్సవాల్లో డీజేలను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారిందని.. శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు డీజేల వినియోగంపై నిషేధాజ్ఞలు విధిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువకులు డీజేలకు అలవాటు పడి తప్పతాగి చిందులేయడం ఫ్యాషన్‌గా మారిందని వివరించారు. డీజేలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిషేధ ఉత్తర్వులను ఎవరైనా అతిక్రమిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శబ్ద కాలుష్యాన్ని నివారించడానికి షేర్ బ్యాండ్, సన్నాయి, డిల్లెం బల్లెం, కోలాటం, చెక్కభజన, పండరి భజన, నృత్య ప్రదర్శనలతో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. అనంతరం కళాకారుడు మీసాల రాము రాసిన 'కలియుగం కలికాలం ఏమాయనో' అనే పాట సీడీని ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కవులు, కళాకారులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి, ఆత్మకూర్ సీఐలు కృష్ణ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి పట్టణ, గోపాల్‌పేట ఎస్ఐలు హరిప్రసాద్, నరేష్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీన్నర గంజాయి పట్టివేత

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ గంజ్‌లో బుధవారం ఇద్దరితో కేజీ 500గ్రా ముల గంజాయి దొరికిందని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ గంజ్‌లో అనుమానాస్పదంగా సంచితో ఇద్ద రు తిరుగుతున్నారని సమాచారం వచ్చింది. ఈ మేరకు వెంటనే సిబ్బందితో అక్కడికెళ్లి వారిని అదుపులోకి తీసుకొని సంచిని తనిఖీ చేయ గా అందులో దాదాపు కేజీ500గ్రాముల గంజాయి లభ్యమైంది. వారిపై కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.